క్లుప్తంగా

నేడు జల్లికాకినాడలో గడపగడపకు మన ప్రభుత్వం

గణపవరం : మండలంలోని జల్లికాకినాడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాల ఏసు సమర్పణ



చిన్నారులతో కలిసి బాల ఏసు దేవాలయం సమర్పణ ర్యాలీ చేస్తున్న దృశ్యం

దెందులూరు : ప్రతి ఒక్కరూ తమ పిల్లలను దయ, సేవ, కరుణ, సత్ప్రవర్తన నేర్పించాలని దెందులూరు ఆర్‌సీఎం ఫాదర్ అమ్మన్‌రాజా అన్నారు. గురువారం స్థానిక ఆర్‌సీఎం చర్చి పరిధిలో బాల ఏసు దేవాలయ సమర్పణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు దైవచింతన నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్ గిరిష్, ఫాదర్ అనిల్, విశ్వాసులు పాల్గొన్నారు.

రైతుల నిరసన



ఉండ్రాజవరంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న రైతులు

దెందులూరు : వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తే రైతుల ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం పోతునూరు శివారు ఉండ్రాజవరంలో ఆంజనేయస్వామి గుడి వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి రైతులతో కలిసి నిరసన తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు బండి రాజా, సున్నా వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల పొలంబడి



దెందులూరులో వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న పొలంబడి

దెందులూరు : మండల వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్ ఆధ్వర్యంలో గ్రామంలో వ్యవసాయ కళాశాల (రాజమండ్రి) విద్యార్థులు పొలంబడి నిర్వహించారు. పెసర ఎల్‌జీజీ-664 రకంలో వచ్చే వైరస్ తెగుళ్ల వల్ల నష్టం, నివారణా మందులు, వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఆకు ముడత, పల్లనాటి తెగుళ్లపై వాడే సస్యరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రామకృష్ణ, హార్టికల్చర్ అసిస్టెంట్ బీవీ నాగేంద్ర, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు లక్ష్మి, గిరిజా కుమారి, ప్రమీల, భావన, జ్యోతిక ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహ మహోత్సవాలు



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు : దెందులూరులోని శ్రీ వెంకటేశ్వరస్వామి సప్తాహ మహోత్సవాలు గురువారం మూడో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాలాజీ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి వివిధ పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేశారు. గ్రామంలోని దంపతులు, అర్చకులు, స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మోపెడ్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ద్వారకాతిరుమల: టీవీఎస్ మోపెడ్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒక వృద్ధుడు తీవ్ర గాయాలు పాలయ్యాడు. ఈ ఘటన ద్వారకా తిరుమలలోని శ్రీవారి కొండపైకి వెళ్లే ఆర్చిగేటు కూడలిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని తిమ్మాపురానికి చెందిన వృద్ధుడు కొనికల్ల వెంకటేశ్వరరావు ద్వారకాతిరుమలలోని వీఆర్‌ఎం ఫంక్షన్ హాలులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు తన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై కొండపైన శ్రీవారి అన్నదాన భవనం వద్దకు వెళుతుండగా గుడిసెంటర్ నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బుట్ట పెడితేనే.. పొట్ట నిండేది



పొలంలో ఎలుక బుట్టలు పెడుతున్న కూలి



రాత్రి పొలంలో పెట్టి తీసివేసిన ఎలుక బుట్టలు

- పంట సమయంలో ఎలుకలను పట్టుకుని కడుపు నింపుకుంటున్న వైనం
- మిగిలిన సమయమంతా పస్తులతో కాలం వెళ్లదీసే పరిస్థితి

పెదవేగి : పంట చేతికొచ్చే సమయంలో ఎలుకలను పట్టుకుని పొట్ట నింపుకుంటున్న పరిస్థితి వారిది. మిగతా సమయాల్లో చేసేందుకు పనిలేక.. పస్తులుండాల్సిన పరిస్థితి. నియోజకవర్గంలో ప్రస్తుతం మినుము, పెసర పంటలలో ఎలుక బెడద ఎక్కువగా ఉంది. దీంతో ఎలుకల బుట్టలు పెట్టే వారికి డిమాండ్ పెరిగింది. ఎలుకలను పట్టే ప్రత్యేక నేర్పరులు ఉండి మండలం పాందూరు, తెనాలి నుంచి పెదవేగి మండలంలోని సూర్యారావుపేట, దెందులూరు వచ్చారు. మినుము మొక్కలు గుబురుగా, దట్టంగా పెరిగినచోట ఎలుకలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందని ఎలుకలు పట్టేవారు దగరపు భాస్కరరావు, చెక్కా పెద్దిరాజు, ఆర్.వెంకటేశ్వర్లు, గారపాటి ప్రసాద్ తెలిపారు. గింజలు తయారయ్యాక వాటిని నాశనం చేసి, బొరియల్లోకి తీసుకెళ్తాయని చెబుతున్నారు. ఎలుకలు తినేది తక్కువ, పాడు చేసేది ఎక్కువని అంటున్నారు. ఎకరానికి 35–45 ఎలుకలు దొరుకుతున్నాయి. ఎలుకల్ని పట్టేందుకు బుట్టలు పెట్టే చోట గుర్తుకు గుచ్చే పెగ్‌ల్ని వీరే తయారు చేస్తారు. రోజుకు ఎకరానికి 35 నుంచి 45 వరకు ఎలుకల్ని పడుతున్నామన్నారు. తక్కువ ఎలుకలు పడితే ఎలుకకు రూ.20 వస్తుందని, ఎక్కువ పడితే రూ.15, రూ.18 చొప్పున రైతులు ఇస్తారని చెబుతున్నారు. రోజుకు ఒకొక్కరికి రూ.500 నుంచి రూ.800 వరకు గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. రైతులు వేసిన పంట చేతికి వచ్చే సమయానికి ఎలుకల బెడద వలన తమకు పని దొరుకుతుందని, సాగు లేనప్పుడు తమ జీవనం అస్తవ్యస్తంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తమలాంటి వారందరికీ ఏదైనా దారి చూపించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం దారి చూపాలి

పంటల సమయంలో ఎలుక బుట్టలు పెట్టి కడుపు నింపుకుంటున్నాం. మిగిలిన సమయంలో ఏ పని చేయలేక, పస్తులు ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం మాలాంటి వారికి ఏదోక పథకం ద్వారా దారి చూపాలి.

– ఆర్ వెంకటేశ్వర్లు, ఎలుక బుట్టల వ్యాపారి, తెనాలి

కుష్టు నిర్మూలనకు మల్టీ డ్రగ్ థెరపీ ఒక్కటే మార్గం



కుష్టువ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు, వైద్య సిబ్బంది

గణపవరం : కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎవరికైనా కుష్టు లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీ సిబ్బందికి తెలియజేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. గురువారం మండలంలోని అగ్రహార గోపవరం గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి గుర్తింపు, నిర్మూలనపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా అదుపు చేయవచ్చునని అన్నారు. కుష్టు వ్యాధికి మల్టీ డ్రగ్ థెరపీ ఒక్కటే మార్గమని, ఇది ప్రభుత్వ వైద్యశాలల్లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ఆరునెలలు చికిత్స తీసుకుంటే కుష్టును అదుపుచేయవచ్చునన్నారు. ఎవరికైనా శరీరంపై రాగిరంగు మచ్చలు ఉండి, స్పర్శలేకుండా ఉంటే వెంటనే తమ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈసందర్భంగా గ్రామంలో సర్వే నిర్వహించారు. చిలకంపాడులో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. మండల లెప్రసీ నోడల్ అధికారి నామాలరాజు కుష్టు నిర్మూలనలో భాగస్వాములం అవుతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం



తోటగూడెం గ్రామ సచివాలయం పరిధిలో పింఛను పంపిణీ

పెదపాడు : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును సచివాలయ కన్వీనర్లు పర్యవేక్షించాలని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ సూచించారు. గురువారం మండలంలోని తోటగూడెం, రాజుపేట, పునుకొల్లు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ కన్వీనర్లతో కలిసి వారు పర్యవేక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు కత్తుల ప్రేమావతి, తొందురు రాజా, పాలిమెట్ల నాని, ఏలూరు డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ సేవాదృక్పథం



తాడేపల్లిగూడెం సమీపంలో బొబ్బిలిలో సోమేశ్వరమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సునీల్

భీమడోలు : అనారోగ్యంతో బాధపడుతూ తమ కుమార్తెల ఇండ్ల వద్ద ఉండి పింఛన్ తీసుకునేందుకు రాలేని ఇద్దరు మహిళలకు గుండుగొలనుకు చెందిన వలంటీర్ కాలి సునీల్ వారు ఉంటున్న గ్రామాలకు వెళ్లి పింఛన్ నగదును అందించారు. గుండుగొలనులోని పువ్వుల వీధికి చెందిన సాయిల సోమేశ్వరమ్మ తాడేపల్లిగూడెం సమీపంలోని బొబ్బిలి గ్రామంలోని తమ కుమార్తె ఇంటికి వెళ్లింది. అదే విధంగా వేమ సీతారత్నం కృష్ణాజిల్లా జగ్గయ్యపేట సమీపంలోని కంచికచర్ల గ్రామంలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. అయితే వారిద్దరూ వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు స్వగ్రామానికి రాలేని పరిస్థితి. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న వలంటీర్ కాలి సునీల్ వారు ప్రస్తుతం నివాసముంటున్న గ్రామాలకు వెళ్లి సాయిల సోమేశ్వరమ్మకు బుధవారం సాయంత్రం, వేమ సీతారత్నంకు గురువారం పింఛన్ సొమ్ము అందించాడు. ఈ సందర్భంగా వలంటీర్‌ను ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, వక్ఫ్‌బోర్డు సభ్యుడు జహీర్, సచివాలయాల కన్వీనర్లు గొటికల మురళీ, నల్ల శంకర్, నాయకులు సుబ్బరాజు, నల్ల శ్రీను అభినందించారు.

పంటల నమోదుతో రైతులకు మేలు



అమ్మపాలెంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పెదవేగి : పంటల నమోదు వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ జేడీఏ వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని అమ్మపాలెం, అంకన్నగూడెం, పెదకడిమి గ్రామాల్లో రైతులు విరివిగా సాగుచేస్తున్న మొక్కజొన్నతో పాటు ఇతర వ్యవసాయ పంటలను మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక, సచివాలయ వ్యవసాయ సిబ్బందితో కలిసి జేడీఏ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంటల్లో వచ్చే తెగుళ్లను రైతులు గుర్తించి స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చి తెగుళ్లకు గల కారణాలను తెలుసుకోవాలన్నారు. తెగుళ్ల తీవ్రతను బట్టి జింక్, పొటాషియ ఏమేరకు వాడాలో వివరిస్తారని చెప్పారు. తెగుళ్లను అవసరమైన పురుగు మందులు వాడకంపై కూడా మండల వ్యవసాయాధికారి సూచనలు, సలహాలు అందిస్తారని జేడీఏ రామకృష్ణ రైతులకు తెలిపారు.

జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

భీమడోలు : జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి గ్రామ సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. భీమడోలు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం హౌసింగ్, ఇళ్లు, కుళాయి పన్నుల సేకరణ తదితర అంశాలపై గ్రామ సమాఖ్యల ప్రతినిధులు, సచివాలయ ఇంజనీరింగ్ ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీడీవో రాఘవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాలను అందించిందన్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులను చైతన్యపర్చాలన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులు, కుళాయి పన్నులను త్వరితగతిన చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, గ్రామ సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన

దెందులూరు : గాలాయగూడెంలోని జగనన్న కాలనీని గురువారం తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య పరిశీలించారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ల కాలనీలకు తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యంతో పాటు నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా స్థానికంగానే మెటీరియల్ స్టోరేజ్ చేయడానికి గోడౌన్ల సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాణశాఖ ఏఈ దివ్య, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ పూజారి అచ్చియ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట వెంకన్న, అంబటి లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవయ్య తదితరులున్నారు.

పోతునూరులో అగ్నిప్రమాదం

దెందులూరు : పోతునూరు గ్రామంలో పసరుకోనేరు చెరువు వద్ద గురువారం ప్రమాదవశాత్తు శాతం పద్మావతి ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దుస్తులు, సరుకులు, సామాగ్రి దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ సపదించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని పరామర్శించి నగదు, సరుకులను అందచేశారు.

అచ్చమ్మ తల్లి సన్నిధిలో ఒంగోలు డీఎస్పీ



ఒంగోలు డీఎస్పీ మేకా సుధాకర్ కుటుంబాన్ని సత్కరిస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ

దెందులూరు : గాలాయగూడెంలోని నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 66వ వార్షిక ఉత్సవాలకు గురువారం ఒంగోలు డీఎస్పీ మేకా సుధాకర్ కుటుంబ సభ్యులు విచ్చేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తాము 22 ఏళ్లుగా ఉత్సవాలకు ఏటా విచ్చేసి అమ్మవారి దీవెనలు పొందుతున్నామని చెప్పారు. తొలుత డీఎస్పీ కుటుంబ సభ్యులకు ఆలయ ఉత్సవ కమిటీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

మహిళా పోలీస్ విధులకు ఆటంకం

టి.నరసాపురం : సచివాలయ మహిళాపోలీస్ విధులను అడ్డగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లంచర్ల రాజుపాలెం గ్రామ సచివాలయంలో బత్తుల గంగారత్నం మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తోంది. పోలీసు అధికారుల ఉత్తర్వులు మేరకు ఆమె పంచాయతీ పరిధిలో జూదాలు, నాటుసారా తయారీదారుల సమాచారం సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలో సమాచారం సేకరించి తిరిగి సచివాలయానికి రాగా అల్లంచర్ల కొత్తగూడేనికి గుండ్ర నాగరాజు అనే వ్యక్తి మహిళాపోలీసును బెదిరించి ఆమె విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురిచేశాడు. దీనిపై కేసు నమోదు కాగా పోలవరం డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- రామన్నగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



వాసుబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఉంగుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం శివారు కొల్లేర తీర ప్రాంత గ్రామమైన రామన్నగూడెం, లంకమాలపల్లి గ్రామాలలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు ఇంటింటి తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా పేదల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. సంక్షేమతోపాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు తాను అండగా ఉంటానని అన్నారు. ఆక్వారంగం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వాసుబాబు వివరించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, ప్రతి ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే వాసుబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొరిపల్లి శ్రీనివాసురావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు నక్కశ్రీను, గంజి ప్రభాకరరావు, ఎంపీటీసీ పంతులు వెంకన్న, ఉప సర్పంచ్ మట్ట మురళి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం సొమ్ము రూ.40 కోట్లు చెల్లింపు

పెదపాడు : మండలంలో 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం లక్ష్యాన్ని నిర్దేశించినట్లు పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాదరావు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు ధాన్యం కొనుగోలు సొమ్ము రూ.40 కోట్లు చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాలు పరిధిలో 34,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జనవరి 11 వరకు జరిగి లావాదేవీలకు గాను రూ.40 కోట్లు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌లో సివిల్‌సప్లై డీఎంచే రూ.18.67 కోట్లు అప్రూవ్ చేయడం జరిగిందని, వారికి త్వరలోనే డబ్బులు చెల్లిస్తామన్నారు. రవాణా, హమాలీ చార్జీలు రైతులందరికీ జమచేసినట్లు చెప్పారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు

పెదపాడు : జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కొత్తూరు, పునుకొల్లు గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2021–2022 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిత తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామంలో వ్యక్తమైన అభ్యంతరాలను సభలో చదివి వినిపించారు. కొత్తూరు సర్పంచ్ కడిమి పద్మావతి గోవిందరావు, కంభంపాటి సునీల్ కృష్ణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీదారులు పాల్గొన్నారు.

వసంతకుమార్‌కు నివాళి



పార్థసారథిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నేతలు కారుమంచి రమేష్, వాసు

భీమడోలు : ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే వట్టి వసంతకుమార్ మృతి రాష్ట్రానికి తీరని లోటు అని పలువురు పేర్కొన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో గురువారం వట్టి వసంతకుమార్ చిత్రపటానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసంతకుమార్ తండ్రి వట్టి వెంకటరంగ పార్థసారథి, ఆయన సోదరుడు రమేష్, ఆయన కుమారుడు పవన్, కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, ఉమ్మడి ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనే ప్రకాశరరావు, నల్లజర్ల, ద్వారకాతిరుమల సొసైటీల చైర్మన్లు కారుమంచి రమేష్, లక్ష్మణ్, ద్వారకాతిరుమల మండల వైఎస్సార్ సీపీ నేత బొండాడ వెంకన్నబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ అకాల మరణం తీరని లోటు అని వైఎస్సార్ సీపీ చేబ్రోలు గ్రామ నాయకుడు, మాజీ సర్పంచి కరణం బుజ్జి అన్నారు. గురువారం చేబ్రోలులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వసంతకుమార్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆకులరాజు, మనసాల కోటేశ్వరరావు, నవుడ కృష్ణారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు ముత్యా బుజ్జి, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు షాజహాన్ పాల్గొన్నారు.

దళితవాడలు నూతన గ్రామ పంచాయతీలు కావాలి

దెందులూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపకులు, డీజీపీ పీవీ సునీల్ కుమార్ కలలు సాకారం చేసే దిశగా కృషి జరగాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా ఇన్‌చార్జి పాడేటి రాంబాబు అన్నారు. జిల్లాలోని మండలాల పర్యటనలో భాగంగా గురువారం దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత గిరిజనుల అభివృద్ధి, ఉన్నతమైన జీవనవిధానం కోసం విద్య ఒక్కటే మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానంలో పయనించాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. అన్ని మండలాల శివారు ప్రాంతాల్లో దళితవాడల్లో నూతన గ్రామ పంచాయతీలుగా రూపాంతరం చెందాలన్న మహా ఉద్యమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అంబేడ్కర్ మిషన్ తరఫున గిరిజన గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, గృహదర్శన్‌లు చేస్తున్నామని రాంబాబు వివరించారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు : రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తణుకు ఎస్‌సీఐఎం కళాశాల అధ్యాపకులు విష్ణువర్ధన్ అన్నారు. గురువారం నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, సదుపాయాలు, మానవ హక్కులను ఏ రకంగా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. స్త్రీ, పురుషుల సమానత్వం గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డి ఉమాశంకర్, నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

పదవీ కాలం ఆరు నెలలు పొడిగింపు

భీమడోలు : గుండుగొలను సొసైటీ త్రిసభ్య కమిటీ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని కమిటీ చైర్మన్ వగ్వాల భాస్కర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఇందులో భాగంగా గుండుగొలను సొసైటీకి పాత కమిటీయే కొనసాగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

పెదపాడు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏపీఓ అనిల్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో పెదపాడు మండలలలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.